
ప్రజాశక్తి
మంగళవారం 20 ఆగస్టు 2024
5
విజయనగరం



బొంతలకోటికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-గజపతినగరం

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జి.టి.పేట సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు బొంతలకోటి శంకరరావు అరుదైన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ గ్లోబెల్ పీస్ విశ్వవిద్యాలయం, డాక్టర్ చిన్నారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో, విశాఖపట్నంలో సెంట్రల్ లైబ్రరీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విశాఖపట్నం నగర జోనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, సినీ రచయిత, నటులు రవితేజ చేతుల మీదుగా అందుకున్నారు. విద్యా, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా, పర్యావరణ రంగాల్లో 25 సంవత్సరాలుగా చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. డాక్టర్ బొంతలకోటి అందుకున్న 310వ అవార్డు కావడం విశేషం. బొంతలకోటిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రామారావు, చైతన్య భారతి సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, డిప్యూటీ డిఇఒ కె.మోహనరావు, జిల్లా అధికారులు అభినందించారు.

కాలువ నీరివ్వనంటోంది

తాటిపూడి కాలువ తుప్పలు, డొంకలతో మూసుకుపోయింది. దీంతో సాగునీటి కాలువ కాస్తా, ఊబిగా మారిపోయింది. ఫలితంగా కాలువ చివరాఖరి ఆయకట్టుకు నీరు పారనంటోంది. ఇటీవల కాస్త వర్షాలు కురవడంతో రైతులకు కొంత వరకూ ఊరట కలిగించినా, ఖరీఫ్‌కు డిసెంబర్ వరకూ నీరు అవసరం. కాబట్టి, ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే పంట పండటం సాధ్యం కాదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- తుప్పలు, డొంకలతో అధ్వానంగా మారిన వైనం
- దెబ్బతిన్న అప్పన్నపాలెం డివిజన్ డ్యామ్
- ఆందోళనలో తాటిపూడి ఆయకట్టు రైతాంగం



పూడుకుపోయిన కాలువ

ప్రజాశక్తి - జామి

తాటిపూడి రిజర్వాయరు పరిధిలో శృంగవరపుకోట, జామి, గంట్యాడ మండలాలకు చెందిన సుమారుగా 16 వేల ఎకరాల రైతుల సాగునీరు కోసం ఎదురు చూస్తారు. జామి మండలంలోనే తాండ్రంగి, విజినిగిరి, తానవరం, జామి, జన్నివలస, విఆర్ పాలెం, వెన్నె, సోమయాజపాలెం రైతాంగానికి నీరు అవసరం. ప్రధానంగా చివరి ఆయకట్టు రైతులకు ప్రతి ఏటా నీటి సమస్య వెంటాడుతోంది. జన్నివలస, సోమయాజిపాలెం, వెన్నె, వెంకటరాజపాలెం గ్రామాలకు చెందిన సుమారుగా మూడు వేల ఎకరాలకు సాగునీటి సమస్య తీవ్రమవుతోంది. వాస్తవానికి ఖరీఫ్‌కు జులై నుంచి డిసెంబర్ వరకూ నీరుండాలి. కాలువ తుప్పలు, డొంకలతో పేరుకుపోవడంతో కాలువ పారే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పన్నపాలెం డివిజన్ డ్యామ్ నుంచి, జామి పల్లపు కాలువ డివిజన్ డ్యామ్ వరకూ కాలువ ఊబిలా మారిపోవడంతో చివర ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. అప్పన్నపాలెం డివిజన్ డ్యామ్ కూడా శిథిలావస్థకు చేరడం, కాలువ పూడిక తీతలు ఏళ్లుగా తీయకుండా వదిలేయడంతో సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు పట్టించుకుని కాలువ పూడిక తీతలు చేపడితే తప్ప, చివరి ఆఖరి ఆయకట్టు పంట పండే ప్రసక్తి లేదని, ప్రభుత్వ పెద్దలు స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఖరీఫ్‌కు సాగుకు తీవ్ర ఆటంకం



తాడిపూడి కాలువ పూడిక తీతలకు నోచుకోక, ఊభిలా మారింది. గ్రామాల్లో రైతులను కదిలించి పూడిక తీతలకు సిద్ధం అయ్యాం. కానీ మనుసులు దిగలేని పరిస్థితి. విశాఖ నుంచి పొక్లెయినర్ తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తే తప్ప ఈ ఏడాది చివరి ఆయకట్టుకు నీరు అందదు.

- సత్యం,
తాడిపూడి ఆయకట్టు రైతుల సంఘం కన్వీనర్

పారిశ్రామికాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగేందుకు అనుగుణంగా సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. 2024-2029 సంవత్సరాల కోసం రాష్ట్రప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించనున్న నేపథ్యంలో, జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించే అంశంపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చ జరిగింది. వివిధ శాఖల అధికారులు, పరిశ్రామిక వేత్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తామని, ఇక్కడి సమస్యలను తొలగించి, పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. కొత్త దరఖాస్తులకు వీలైనంత వేగంగా అనుమతించాలని, ఇప్పటికే అనుమతించిన వాటిని త్వరగా ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ మాట్లాడుతూ జిల్లాలోని వనరులు, అవసరాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, అందుకు అనుగణమైన పరిశ్రమలను స్థాపించేలా అధికారులు, నిపుణులు చర్చించి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. సమావేశంలో పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వరరావు, సిపిఒ పి.బాలాజీ, ఎపిఐఐసి ఎం బి.రామకృష్ణ, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, ఎల్‌డిఎం ప్రసాద్, పొల్యూషన్ ఇఇ సరిత, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు కాపుగంటి ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పరిశ్రమ స్థాయికి చేనేత రంగం

విజయనగరం కోట : జిల్లాలో చేనేత రంగాన్ని పరిశ్రమ స్థాయికి అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేనేత జౌళిశాఖ అధికారులను ఆదేశించారు. చేనేత జౌళిశాఖ అధికారులు, సొసైటీల ప్రతినిధులతో తన ఛాంబర్‌లో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నూతన టెక్స్‌టైల్ పాలసీని రూపొందించనుందని, దీనికోసం జిల్లా నుంచి అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని చెప్పారు. జిల్లాలో సుమారు 30వేల మంది చేనేత కార్మికులు ఉన్నప్పటికీ, వీరిలో చాలామంది వృత్తికి దూరంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 చేనేత సహకార సంఘాల్లో సుమారు 2,500 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వీరిలో కేవలం 9 మంది మాత్రమే ప్రస్తుతం చురుకైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వారి జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి జరిగే విధంగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్ సూచించారు. చేనేత కార్మికులకు నూలు కొనుగోలులో ఇస్తున్న సబ్సిడీ శాతాన్ని పెంచడం, జిఎస్‌టి తగ్గించడం, ఆప్కో ద్వారా ఎప్పటికప్పుడు వస్త్రాలను కొనుగోలు చేసి బిల్లులు చెల్లించడం, పవర్ లూమ్స్ సంఖ్యను భారీగా పెంచడం, టెక్స్‌టైల్స్ పరిశ్రమను ప్రోత్సహించడం, గార్మెంట్ యూనిట్స్ ఏర్పాటు చేయడం తదితర సూచనలు చేశారు. ఈ సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, చేనేత జౌళిశాఖ ఎడి ఆర్‌వి మురళీకృష్ణ, అభివృద్ధి అధికారులు బి.వసంత, శంకర్రావు, ఆప్కో, సొసైటీల మాజీ అధ్యక్షులు వెంకటరమణ, కొండపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రక్షాబంధన్ శుభాకాంక్షలు

విజయనగరం కోట : రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మ కుమారీ లు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్‌కు రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతిలో రక్ష బంధన్ ఒక భాగమని కలెక్టర్ ఎర్కొంటూ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారిలు బికె మాధురి, బికె మంజూష పాల్గొన్నారు. విజ్ఞాన భారతి పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్‌డిఎ పీడీకి రాఖీలు కట్టారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

మద్యం మత్తులో
సెక్యూరిటీ గార్డుపై దాడి

ప్రజాశక్తి-భోగాపురం

మద్యం మత్తులో ముగ్గురు యువకులు సెక్యూరిటీ గార్డుపై దాడి చేశారు. దీంతో ఆ వ్యక్తి కోమాలోకి వెళ్లిపోయి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి రెడ్డికంచేరు సమీపంలో విమానాశ్రయానికి వెళ్లే గేటు వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం...

చావుబతుకుల మధ్య యువకుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్

మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన గంట్రేటి సురేష్ విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టి వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే మండలంలోని చేపలకంచేరుకు చెందిన అరజల్ల రాజు, రామచంద్రపేటకు చెందిన సుగ్గు రమణ, కొంగవానిపాలెం గ్రామానికి చెందిన కోరాడ శ్రీను కలిసి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. విమానాశ్రయం నిర్మాణంలో కార్మికులుగా పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు కొంతమంది వ్యక్తులతో వారికి వివాదం జరిగింది. అనంతరం ఆ కార్మికులు తమ నివాసాలకు వెళ్లిపోయారు. దీంతో మద్యం మత్తులో ఉన్న వీరు ముగ్గురు గేటు వద్దకు వచ్చి లోపలికి వెళ్లబోయారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డ్ సురేష్ వెళ్లకూడదని అడ్డుపడ్డాడు. స్థానికులమైన తమకు కాదని బయట వ్యక్తులకు అండగా ఉంటావా? అంటూ సురేష్‌పై దాడి చేశారు. అంతటిలో ఆగకుండా రోడ్డు అవతల వైపుకు ఈడ్చుకొని వెళ్లి అక్కడ రాడ్డుతో బలంగా తలపై కొట్టడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొన్నాళ్ల నుంచి అక్కడ పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతోనే ఇంత ప్రమాదానికి దారి తీసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇచ్చే ముందు
ఒకసారి ఆలోచించండి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మైనర్లకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు, వాహన యజమానులు ఒకసారి ఆలోచించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. నగరంలో ఆదివారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులు, వాహన యజమానులకు సోమవారం ఎస్‌పి స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు డ్రైవింగు లైసెన్సు ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం మానసిక పరిపక్వత ఉండక పోడమేనన్నారు. సాధారణంగా మైనర్లు వాహనం నడపడంలో ఉత్సుకతో వ్యవహరించి, వేగంగా, అజాగ్రత్తగా, ప్రమాదకరంగా నడపడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. మైనర్లు వాహనాలను డ్రైవ్ చేసి, ఇకపై పట్టుబడితే ఆయా వాహనాలను సీజ్ చేయడంతోపాటు, వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐ సూరినాయుడు, ఎస్‌ఐలు లోవరాజు, శంఖాన రవి, ఎ.మహేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఎస్‌పి నిర్వహించారు. 31 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి అధికంగా ఉన్నట్లుగా ఎస్‌పి తెలిపారు. తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐ గణేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవిధ్య భరితంగా విజయనగరం ఉత్సవాలు

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబరులో రెండు రోజుల పాటు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అక్టోబరు 15న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం జరిగే అవకాశం ఉండటంతో 13, 14 తేదీల్లో మాత్రమే ఉత్సవాల నిర్వహణకు అవకాశం ఉందని, అందువల్ల ఈ రెండు రోజుల్లోనే కార్యక్రమాలు చేపట్టేలా ఏర్పాట్లు చేయాల్సి ఉందని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. ఈ ఏడాది విజయనగరం ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రాథమిక స్థాయిలో ఒక అవగాహన కోసం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు జిల్లా అధికారులతో కోటలో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ప్రజలకు వినోదం పంచే, ఆకర్షించే విధంగా మరికొన్ని వైవిధ్య భరితమైన కార్యక్రమాలను ఈ ఏడాది కొత్తగా చేపట్టాల్సి ఉందని కలెక్టర్ సూచించారు. విజయనగరం చరిత్రను తెలిపేలా లేజర్ షో, డ్రోన్ షో, హెలికాప్టర్ ద్వారా నగర వీక్షణం, రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల నిర్వహణ వంటి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందని సూచించారు. అదేవిధంగా కోట చుట్టూ ఉన్న ప్రాంతాన్ని సుందరీకరణ చేపట్టాల్సి ఉందన్నారు. విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో కోట చుట్టూ గార్డెనింగ్ చేపట్టి అమ్మవారి పండుగ సమయానికి అత్యంత సుందరంగా తీర్చిదిద్దేలా ప్రాజెక్టు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గత ఏడాది తరహాలో జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి సరస్ ఎగ్జిబిషన్ నిర్వహణ, ఫ్లవర్ షో, స్థానిక కళలను ప్రోత్సహిస్తూ ఇక్కడి కళాకారులతో ప్రదర్శనలు చేసేందుకు రూపకల్పన చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, డి.ఎస్.డి.ఒ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కూర్మనాథరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూడు రోజుల పాటు స్థానిక ఇండోర్ స్టేడియం లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో గుంటూరు, కృష్ణ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళల సింగిల్స్ విభాగంలో టి.సూర్య చరిష్మా విజేతగా నిలిచింది. మహిళల డబుల్స్ విభాగంలో ప్రకాశం, కృష్ణా, పురుషుల డబుల్స్ విభాగంలో గుంటూరు, తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వీరికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రఘురాజు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎ నాయుడు, కార్యదర్శి నున్నా సురేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో సిటియు విసి భేటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టమని సోమవారం కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానానికి సంబంధించి తాను రచించిన పుస్తకాన్ని కలెక్టర్ కు బహుకరించారు. జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులను ప్రారంభించే అంశంపై ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్ లో విశ్వవిద్యాలయ సమస్యలను ప్రస్తావిస్తూ కొత్త క్యాంపస్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడంలో సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయాలు నివేదిస్తానని కలెక్టర్ చెప్పారు.

పంపు హౌస్ కార్మికులకు
బేసిక్ వేతనం చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్ ప్రజలకు తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.25,500వేలు చెల్లించేలా టెండర్‌లో కోడ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా సోమవారం నిర్వహించారు అనంతరం గ్రీవెన్స్ లో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పంప్ హౌస్ కార్మికులను థర్డ్ పార్టీ విధానంలో కొనసాగించడం వల్ల గత ఐదేళ్లలో ఒక్కొక్క కార్మికుడు సుమారు మూడు లక్షల రూపాయలు జీతం కోల్పోయారని, కేవలం నెలకు రూ.11వేలు జీతం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ఈ ఏడాది జూన్, జులై వేతనం నేటికీ చెల్లించలేదని, 2022 లో అమృత పథకం కార్మికులకు 2 నెలల బిల్లులు కౌన్సిల్ ఆమోదానికి కూడా పెట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టే ప్రస్తుత టెండర్ లో రూ.25500 బేసిక్ వేతనం చెల్లించే విధంగా టెండర్లు కోడ్ చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ ప్రకారం అర్హత ఉన్న వారికి టెక్నికల్ వేతనాలు చెల్లించాలన్నారు. లేదంటే దశల వారి ఆందోళనలకు సిద్ధం కావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ యం. మురళీ, నారాయణ రావు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వినతుల పరిష్కారానికి
కమాండ్ కంట్రోల్ రూమ్

- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
- ప్రజా వినతుల పరిష్కార వేదికకు 129 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వినతుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అన్ని శాఖల నుండి సిబ్బందిని ఒక్కొక్కరు చొప్పున ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డిప్యూట్ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదిక లో భాగంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సిఎంఒ నుంచి కలెక్టర్‌కు వచ్చే వినతులను ఆయా సంబంధిత అధికారులకు పంపడం జరుగుతోందని, అర్జీదారుతో మాట్లాడి, సంతృప్తి చెందిన తర్వాతనే వారి ఫోటో తో పాటు సమాధానాన్ని అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యమైన, ఖచ్చితమైన సమాధానాలు ఉండాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని తెలిపారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఈ రోజు నాట్ ఓపెన్ 8 వినతులు ఉన్నాయని, సాయంత్రానికి అవి జీరో కావాలని తెలిపారు. వినతులు పరిష్కారం లో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎక్కువగా రెవిన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహశీల్దార్లు ఈ విషయం లో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

ఈవారం రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయి.కలెక్టరేట్ ఆడిటోరియంలో. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 129 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి 90, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 9వినతులు అందాయి. మున్సిపాలిటీకి 9, పంచాయితీ శాఖకు 06, అండగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

హాస్టళ్లలో సౌకర్యాలు పునరుద్ధరించాలి

నియోజకవర్గంలో హాస్టళ్లలో సౌకర్యాలను పునరుద్ధరించాలని టిడిపి నాయకులు.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి అందించారు. గత వైసిపి ప్రభుత్వం వసతి గృహాలను గాలికి వదిలేసిందని, దీంతో విద్యార్థులు చేరకపోవడంతో హాస్టళ్లలో సింగిల్ డిజిట్‌కు పడిపోయిందని చెప్పారు. కొన్ని హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, బంగారుబాబు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

రామారావుకు గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణానికి చెందిన డాక్టర్ డి.రామారావుకు గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. మా మహామాయ ఇండస్ట్రీస్‌లో ఆయన ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాస్తుశాస్త్రంపై నిర్వహించిన కార్యక్రమంలో 100 సంక్లిష్టమైన ప్రశ్నలకు 5 గంటలలో సమాధానాలు, కొన్ని సమస్యలకు తగు వివరణలు విశ్లేషణలు ఇచ్చారు. దీంతో గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు లిఖించారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సంస్థ నుంచి భారతీయ రత్న సమ్మాన్ పురస్కారం ఆయనకు లభించింది.



జైలును పరిశీలిస్తున్న సివిల్ జడ్జి విజయకళ్యాణి

సబ్‌జైలును సందర్శించిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కళ్యాణి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న వసతుల గురించి వారి ఆరోగ్యం పట్ల, ఆహారం, పారిశుధ్యం విషయాల గురించి ఆరా తీశారు. ఉచిత న్యాయ సేవల గురించి రిమాండ్ ఖైదీలకు వివరించారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో కోరారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం చేస్తామని హామీలు ఇచ్చినా ఆచరణలో అమలు చేయకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు, రైతుకు ఆర్థిక సాయం రూ.20 వేలు, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలని కోరారు.

నిందితులను ఉరితీయాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన పట్టణంలోని గాంధీ కూడలిలో సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు జెసి రాజు, ప్రవీణ్ కుమార్, సింహాచలం పాల్గొన్నారు.

భోగాపురం సిఐగా ప్రభాకర్

ప్రజాశక్తి భోగాపురం



భోగాపురం సిఐగా ఎన్.వి ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎ.రవికుమార్‌కు విజయనగరం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ అయింది. విశాఖపట్నం రేంజ్ విఆర్‌లో ఉన్న ప్రభాకర్‌రావును ఇక్కడ సిఐగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సూర్యకుమారి, ఎఎస్ఐ రాజు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి సోమవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న గదిలోకి మార్చాలని కార్యకర్త రామలక్ష్మికి సూచించారు.



ఇ-పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ నిర్మల

ఇ-పంట నమోదు

ప్రజాశక్తి-డెంకాడ

ఇ-పంట నమోదు రైతులు విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.నిర్మల కోరారు. సోమవారం మండలంలో వివిధ గ్రామాల్లో ఇ-పంట నమోదు చేపట్టారు. మండలంలో వరి 3260 ఎకరాలు, మొక్కజొన్న 50 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.



పండ్లు పంపిణీ చేస్తున్న శశిభూషణరావు, రవికృష్ణ

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వీరబొబ్బిలి ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 70 మంది రోగులకు వైద్యాధికారి జి.శశిభూషణరావు, ఎముకల వైద్యులు రవికృష్ణ చేతుల మీదుగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగబాబు, రాజన్, ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి రైల్వే ఉద్యోగి మోపాడ మోహన్ గ్రూప్-2 పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం అందజేశారు. ఈ గ్రంథాలయంలో మోహన్ చదువుకొని ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద రక్షాబంధన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యత తెలియజేయడానికి ప్రతి విద్యార్థినిని సోదరీ భావంతో చూడాలనే దృక్పథాన్ని విద్యార్థుల్లో కల్పించేందుకు ప్రతి ఏటా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు తయారు చేసి అమలు చేయాలని, అప్పుడే నిజమైన రక్షాబంధన్ చేసుకోగలమని అన్నారు. బాలికలకు గుడ్ టచ్ బాడ్ టచ్ విధానాన్ని నేర్పిస్తారో అదే విధంగా ప్రతి తల్లి తన కొడుక్కి ఇతర స్త్రీలతో ఎలా మెలగాలో నేర్పించాలని కోరారు. కోల్‌కతాలో హత్యాచారానికి గురై హత్యగావింపబడ్డ జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మహిళా నాయకులు, విద్యార్థినులు ప్రజలకు, మీడియా వారికి, పోలీసులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోమేశ్ రాజు గుణ మురళి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మణికుమార్ కోరారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ లోవరాజు, ఆటో డ్రైవర్లు, తోటి విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. ఈసందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు, బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళలు, బాలికలను సోదర భావంతో చూడాలన్నారు. దేశంలో చిన్నపిల్లలు నుంచి 70ఏళ్ల వృద్ధుల వరకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలను నివరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు కె.శివ, చరణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.





బొబ్బిలిలో డిఎస్‌పి శ్రీనివాసరావు, గజపతినగరంలో ఎస్ఐ మహేష్‌కు రాఖీలు కడుతున్న ఎస్ఎఫ్ఐ మహిళా నాయకులు, విద్యార్థినులు

గజపతినగరం : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి శిరీష మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ సోదరి భావంతో చూడాలనే దృక్పథాన్ని విద్యార్థుల్లో కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు కూడా రక్షాబంధన్ రోజైనా బాలికల కోసం, స్త్రీల కోసం ఆలోచించి వారి రక్షణకు పటిష్టమైన చట్టాలు తయారు చేసి అమలు చేయాలని కోరారు. అప్పుడే నిజమైన రక్షాబంధన్ చేసుకోగలమని వివరించారు. కోల్‌కతాలో అత్యాచారానికి, హత్యకు గురైన జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు ప్రజలకు, మీడియా ప్రతినిధులకు, గజపతినగరం ఎస్ఐ యు.మహేష్‌కు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా, జిల్లా కమిటీ సభ్యులు సోమేష్, మండల నాయకులు జయ, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రక్షాబంధన్‌ను నిర్వహించారు. సిఐ మూర్తికి విద్యార్థినులు రాఖీ కట్టారు. అనంతరం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు అను, చరణ్, మండల అధ్యక్షులు రత్న, చైతు, రాము నాయుడు, ప్రశాంతి, ఉమ, శివ తదితరులు పాల్గొన్నారు.





శృంగవరపుకోట పట్టణంలోని దేవి కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ; విజయనగరంలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు 21న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 21న నగరంలోని మహిళా ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పొన్నేరి, పుదువయల్ లో కె.ఎల్.గ్రూప్ ఎస్‌కె సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో 500 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనీ, ఎంపికైన వారు పికింగ్, ప్యాకింగ్, సీలింగ్, సార్టింగ్, లోడింగ్, అన్ లోడింగ్ తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వుండాలని పేర్కొన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు ఐఐఎఫ్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కస్టమర్ రిలేషన్ షిప్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ గా పని చేసే నిమిత్తం అర్హులైన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కస్టమర్ రిలేషన్ షిప్ ఆఫీసర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. బ్రాంచి మేనేజర్ పోస్టుకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. కస్టమర్ రిలేషన్ షిప్ ఆఫీసర్ 150 పోస్టులు, బ్రాంచి మేనేజర్ 30 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు employment.ap.gov.in వెబ్ సైట్ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, బయో డేటా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు బిసి కాలనీ, మహిళా ప్రాంగణంలో గల ప్రభుత్వ ఐటిఐ కు అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919179415 మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకో వచ్చని పేర్కొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం సందర్శించారు ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందించే సేవల గూర్చి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులందరితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. పేద ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. గత టిడిపి హయాంలో దిను ఎమ్మెల్యే ఉన్నప్పుడు ఆస్పత్రిని అభివృద్ధి చేశానని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆస్పత్రి నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


చిరంజీవి యువత ఆధ్వర్యాన నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా సోమవారం గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు), సత్యం వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, నారాయణ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మొయిద నారాయణ రావు మాష్టారు మాట్లాడతూ రక్తదానమన్నా నేత్రదానమన్నా టక్కున గుర్తుచ్చేది చిరంజీవి అభిమానులేనని అన్నారు. నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించిన మెగాభిమానులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేట్ అభ్యర్థి గాయత్రి, జిల్లా చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి లోపింటి కళ్యాణ్, జనసేన నాయకులు లాలిశెట్టి రవితేజ, నాయకులు గాజులరేగ చిన్న, వాసు, ఉరిటి సాయి, లంకాపట్నం కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి అభిమానులు

అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు పిలుపు మేరకు నగరంలో మెగా సోల్జర్స్ ఆధ్వర్యాన వైఎస్ఆర్ నగర్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ ప్రతి సేవా కార్యక్రమానికి తన వంతు సహాయం ఉంటుందని అన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ బాలభాస్కరరావు

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సోంపురం, వేపాడ, ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం స్కూల్ కాంప్లెక్సు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.బాలభాస్కరరావు మాట్లాడుతూ అభ్యసనా సామర్థ్యాలపై, విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.జగదీశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో మంగళవారం నుంచి వచ్చే నెల 18 వరకు పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎం.శ్రీకాంత్ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్రు సెల్లోసిస్ వ్యాధి టీకాలు కూడా వేస్తామని తెలిపారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ జి.ఉమ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు రెండు అర్జీలు అందజేశారు. బడి బస్సు వెళ్లేందుకు వీలుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగించాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

బిఎల్ఒల సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని బిఎల్ఒలతో తహశీల్దార్ సన్యాసినాయుడు సోమవారం సమావేశమయ్యారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని ఆయన సూచించారు.

కొత్తవలస : ఎన్నికల సమయంలో బిఎల్ఒలు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని తహశీల్దార్ నీలకంఠ రావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలోని పెన్షనర్స్ బిల్డింగ్‌లో సోమవారం బిఎల్ఒలకు ఓటర్ల జాబితా సవరణ, వివరాల సేకరణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఓటు హక్కు కలిగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

విజయానికి ఆత్మ విశ్వాసం అవసరం

ప్రజాశక్తి-డెంకాడ

విద్యార్థులు జీవితంలో విజయం సాధించడానికి ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని హైదరాబాద్‌లోని ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్ఎల్‌యు) సీనియర్ ప్రొఫెసర్ జి.సువర్ణ లక్ష్మి తెలిపారు. మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా కొత్తగా చేరిన బి.టెక్ విద్యార్థులకు 'భాష, జీవితం' అనే అంశంపై ఏర్పాటుచేసిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యలో భాష కీలక పాత్రను నొక్కిచెప్పారు. ఈ రంగంలో విజయం సాధించడానికి కమ్యూనికేషన్‌లో విశ్వాసం అవసరమని తెలిపారు. భాషా నైపుణ్యాలు విద్యార్థులకు భవిష్యత్ కెరీర్‌లో వారి ఆలోచనల, అవసరాలను సమర్థవంతంగా తెలియజేయడానికి ఎలా శక్తినివ్వగలవో వివరించారు. ఇంజినీరింగ్ విద్యలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేలా ఓరియంటేషన్ ప్రోగ్రామ్ విద్యార్థులను తీర్చిదిద్దుతుందని ప్రిన్సిపాల్ రామారెడ్డి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, ఆంగ్ల విభాగానికి చెందిన శ్రావణి, రేవతి, ఎమ్‌డి రిజ్వాన్, హెచ్ఒడి డాక్టర్ దుర్గా శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై రేపు బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం భారత్ బంద్ నిర్వహించనున్నట్లు అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని కోరారు. వర్గీకరణకు వ్యతిరేకంగా జరగనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. బంద్ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేస్తామని, బుధవారం ఉదయం 7 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ



రాము మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని అమకాం జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ సన్యాసినాయుడు కథనం ప్రకారం.. భోగాపురం మండలం ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు రాము (25) విజయ నగరం నుంచి చింతలవలస మీదుగా స్వగ్రామం ముంజేరు బైక్‌పై వెళ్తున్నాడు. అమకాం జంక్షన్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. రాత్రి కావడంతో ఎవరూ చూడలేదు. సోమవారం ఉదయం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముంజేరుకు చెందిన రాముగా పోలీసులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రాము తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో పెద్ద గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బొబ్బిలిలో సోమవారం భారీ వర్షం కురవడంతో గోతులలో నీరు చేరింది. దీంతో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో వాహనాలు దిగి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఐదు రోజుల క్రితం గోతిలో ద్విచక్ర వాహనం దిగడంతో ప్రమాదం జరిగింది. సోమవారం గోతిలో ఆటో బోల్తా పడింది. ఆటో బోల్తా పడిన వెంటనే అక్కడ ఉన్నవారు ఎత్తివేయడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రభుత్వం స్పందించి పూల్‌బాగ్ రోడ్డు బాగు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని నెలివాడ గ్రామ సముదాయం వద్ద ఆదివారం సాయంత్రం ఇద్దరు వ్యక్తుల నుంచి 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు గజపతినగరం సిఐ జివివి.రమణ తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక పోలీష్ స్టేషన్ లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నెలివాడ గ్రామ సమీపంలో గంజాయితో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం అందటంతో హుటాహుటిన ఎస్ఐ కె.లక్ష్మణరావు తన సిబ్బందితో కలిసి వెళ్లి వారిని అరెస్టుచేశారు. వారి వద్ద నుండి 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన పావాడ పవన్ కుమార్ విశాఖ సమీపంలోని కొమ్మాది వద్దనున్న గాయత్రి ఆసుపత్రిలో వార్డ్ బాయ్‌గా పని చేస్తూ గంజాయిని అమ్ముతున్నాడు. పవన్ కుమార్ ఒడిశా రాష్ట్రంలోని సుంకి గ్రామానికి చెందిన సుంకరి సూరిబాబు వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేశారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేశామని సిఐ తెలిపారు. ఎస్ఐ కె.లక్ష్మణరావును, పోలీష్ సిబ్బంది అప్పలనాయుడు, రామ్ కుమార్, శ్రీనును అభినందించారు.